# సాంఘిక శాస్త్రము

# SOCIAL SCIENCE

## TELUGU MEDIUM

## తరగతి ఆరు

## STANDARD SIX

## తృతీయాంతరం

## TERM III


**TRANSLATORS**

K.V. Madhusudana Reddy, P.G.Asst.,S.K.P.D. Boys Hr. Sec. School, Chennai-1.
K. Srinivasulu, P.G.Asst., S.K.P.D. Boys Hr. Sec. School, Chennai-1.
R. Subramaniyam, B.T.Asst., Govt. Hr. Sec. School, Chennai.
N. Rajendrudu, B.T.Asst., D.R.B.C.C.C. Hr. Sec. School, Chennai-11.
T. Jagadeesh Babu, B.T.Asst., The M.U.P. Hr. Sec. School, Chennai-79.
K. Vijayalakshmi, B.T.Asst., A.H.M. Bentinck Hr. Sec. School for Girls, Chennai-7.
P. Devarajulu, B.T.Asst., Govt. Girls High School, Pallipat, Tiruvallur-631 207.
G. Subramaniyam, B.T.Asst., D.R.B.C.C.C. Hr. Sec. School, Tiruvallur.
D. Jayaprakash, B.T.Asst., Govt. Hr. Sec. School, Pallipat, Tiruvallur-631 207.
A.P. Dhana Mary, B.T.Asst., S.K.D.T. Hr. Sec. School, Villivakkam, Chennai-49.



**Laser Typeset, Layout, Illustrations**

**P. Bhagavan, M. Vijayasarathy, T. Raghu**

# 1. స్థానిక ప్రభుత్వము

మన భారతదేశము సువిశాలమయిన భూభాగమును కలిగియున్నది. అధిక జనసాంద్రతను కలిగియున్నది. ఇక్కడ ప్రజలు గ్రామములందు, పట్టణములందు మరియు నగరములందు నివసించు చున్నారు. ఇంతటి విశాల భూభాగమునందు నివసించు కోట్లాది మంది ప్రజల అవసరములు మరియు సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములే తీర్చలేవు.

భారతదేశములోని మారుమూల ప్రాంతాలలో వున్న ప్రజలకు సేవ చేయడానికి స్థానిక ప్రభుత్వము ఏర్పరచబడినది. ఇటువంటి స్థానిక ప్రభుత్వమును గురించి మనము ఈ పాఠమున నేర్చుకొనెదము.

## కృత్యము

మీ గ్రామము యొక్క పేరు ఏమి? మీ గ్రామమునకు ఆ పేరు ఎట్లు వచ్చెను? వాటికి అర్థము, కారణము ఏమైనా తెలియునా? అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, గ్రామపెద్దలనడిగి తెలుసుకొనుము. మంచి అర్థమును తెలుపు గ్రామముల పేర్లు, తమిళనాడు యొక్క గొప్పతనమును తెలుపుచున్నది. వాటిలో కొన్ని గ్రామముల పేర్లు చరిత్ర ప్రసిద్ధి చెందినవి. అవి

"గంగైకొండ చోళపురము"

"మలయడి కురిచ్చి"

"సేరన్‌మాదేవి"

"సాన్‌డ్రోర్‌పాలయమ్"

"ఎప్పోదుమ్‌వెన్‌డ్రాన్"

"నల్లాన్ పిళ్ళై పెట్రాళ్"

"పాల్‌వార్తు వెన్‌డ్రాన్"

"తిరుసిట్రమ్‌బలమ్"

"మలయాండి పట్టణమ్"

"పన్ పోళిల్"

వీటికి ఆపేర్లు ఎలా వచ్చెను? మీ ఉపాధ్యాయుని అడిగి తెలుసుకొనుము. విద్యార్థులను చిన్న గ్రూపులుగా విభజించి ఒక్కొక్క గ్రూపుచే కొన్ని గ్రామముల పేర్లు, వాటికి ఆ పేర్లు ఎలా వచ్చినవో చర్చించుము.

మీ గ్రామములో 'గ్రామ పంచాయతీ కార్యాలయము' అను పేరు గల ఒక భవనమును నీవు చూసివుందువు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మరియు వార్డు సభ్యుల పేర్లు అచ్చటి బోర్డుపై వ్రాయబడి ఉండును.

అదే విధముగా పట్టణ పంచాయతి సమితి, జిల్లా పంచాయతి సమితి, పురపాలక సంఘము మరియు నగరపాలక సంస్థలు కూడా ప్రజా ప్రతినిధులతో పనిచేయుచున్నవి.

ఈ పద్ధతినే 'స్థానిక పరిపాలన' అని అందురు. 'రిప్పన్ ప్రభువు' స్థానిక స్వపరిపాలనను భారతదేశమునందు ప్రవేశపెట్టెను. స్వతంత్ర్యము పొందక మునుపే మన దేశమునందు స్థానిక స్వపరిపాలన ఏర్పడి ఉన్నది.

## గ్రామ పంచాయతి

గ్రామము యొక్క స్థానిక సంస్థను గ్రామ పంచాయతి అందురు. దీని అధ్యక్షుడు, వార్డు సభ్యులను ప్రజలు ప్రత్యక్షముగా ఎన్నికల ద్వారా ఎన్నుకొందురు. ఉపాధ్యక్షునిగా వార్డు సభ్యులు తమలో ఒకరిని ఎన్నుకొందురు. వీరు 5 సంవత్సరములు అధికారములో ఉందురు.

## గ్రామ పంచాయతి విధులు

☆ గ్రామ రహదారులను వేయుట.

☆ మంచినీటి సరఫరా.

☆ మురికి నీటి కాల్వలను ఏర్పరుచుట.

☆ వీధి దీపాలను ఏర్పరుచుట.

☆ చిన్న వంతెలను నిర్మించుట.

☆ గృహనిర్మాణములకు అనుమతినిచ్చుట.

☆ గ్రామ గ్రంథాలయములను పర్యవేక్షించుట.

☆ సామూహిక గృహములను నిర్మించుట.

☆ ఆటస్థలములను మరియు వినోద కేంద్రములను ఏర్పరచి పర్యవేక్షించుట.

క్రింది సమస్యలను పరిష్కరించుటకు నీవు ఎవరికి విన్నవించెదవు?

మీ గ్రామమునందు వీధి దీపములు వెలగడం లేదు. రహదారులు దెబ్బతిని వున్నవి. త్రాగునీటి కొరత ఏర్పడినది. మురుకి నీటి కాలువలో మురికి నీరు నిల్వయున్నది.

పైన సూచించిన పనులు చేయడానికి నిధులు అవసరం కదా! ఆ నిధులను ఎవరు ఇచ్చెదరు? ప్రజలయిన మనమే కదా! మన దగ్గర నుండి ఇంటి పన్ను, నీటి పన్ను, వృత్తి పన్ను, ఆస్తి పన్ను మున్నగు పన్నులు వసూలు చేయుచున్నారు. ఈ పన్నుల నుండి పైన సూచించబడిన పనులకు ఖర్చు చేయుచున్నారు.

### ఆదాయము

☆ ఇంటి పన్ను, వృత్తి పన్ను, దుకాణములపై విధించు పన్ను.

☆ క్రొత్తగా త్రాగునీటి సరఫరాను ఏర్పరుచుటకు చెల్లించు రుసుము మరియు త్రాగునీటి పన్ను.

☆ భూమి శిస్తు ఆదాయములో ఒక భాగము.

☆ ఆస్తి రిజిస్ట్రేషన్ పన్నులో ఒక భాగము – మున్నగు ఆదాయమును గ్రామ అభివృద్ధికి ఖర్చు చేయుదురు.

ఇవి మాత్రమే చాలదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములు వివిధ ప్రణాళిక నిధులను, గ్రాంట్లను జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థల ద్వారా గ్రామములకు అందజేయుచున్నవి.

### గ్రామ సభలు

ప్రతి గ్రామమునందు ఒక గ్రామ సభ కలదు. ఆ గ్రామ సరిహద్దులో ఉన్న వారందరూ ఇందులో సభ్యులు. గ్రామీణాభివృద్ధి పథకములు, సంవత్సర జమ ఖర్చు ప్రణాళికలు మున్నగు అంశములు గ్రామ సభలో అంగీకారము పొందిన పిదప అమలులోనికి వచ్చును.



**కృత్యము**

మీ గ్రామమునందు గ్రామ సభ జరుగునపుడు మీరు చూసియున్నారా? తల్లిదండ్రులతో వెళ్ళి చూడండి. గ్రామ సభలు జరుగు తీరును చూసి వివరములను అడిగి తెలుసుకొనుము.

గ్రామ సభలు సంవత్సరమునకు నాలుగు సార్లు సమావేశమగును.

| | | |
|---|---|---|
| జనవరి 26 | – | గణతంత్ర దినము |
| మే 1 | – | కార్మికుల దినము |
| ఆగష్టు 15 | – | స్వాతంత్ర్య దినము |
| అక్టోబర్ 2 | – | మహాత్మా గాంధి జన్మ దినము |

ఈ నాలుగు రోజులు ప్రభుత్వ సెలవు దినములు. ఈ రోజులలో గ్రామ సభలు జరపడం అందరికి సౌకర్యముగా ఉండును. ఈ ప్రభుత్వ సెలవు దినములలో కాక ఏవైనా అత్యవసరమైన పథకములకు అనుమతి పొందవలెనన్న ప్రత్యేక గ్రామ సభలు జరుపవచ్చును.

మీ గ్రామ పంచాయతిలో పనిచేయుచున్న సభ్యుల ద్వారా పన్నులు వసూలుచేయు పద్ధతిని తెలుసుకొనుము.

### పంచాయతి యూనియన్

పలు గ్రామ పంచాయతిలు కలిసి ఏర్పడినదే పంచాయతి యూనియన్. పంచాయతి యూనియన్ సభ్యులను ప్రజలు ఎన్నికల ద్వారా 1:5000 నిష్పత్తిలో ఎన్నుకొందురు. వీరిలో ఒకరిని పంచాయితి యూనియన్ అధ్యక్షునిగా ఎన్నుకొందురు.

### పంచాయతి యూనియన్ విధులు

- ☆ పంచాయతి యూనియన్ రహదారుల నిర్వహణ.
- ☆ త్రాగునీటి వసతి కల్పించుట.
- ☆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రములను ఏర్పరుచుట.
- ☆ ప్రాథమిక పాఠశాలల నిర్వహణ.
- ☆ ప్రసూతి ఆరోగ్య కేంద్రముల నిర్వహణ.
- ☆ గ్రామ సంతలను ఏర్పరుచుట.
- ☆ పశు వైద్యశాలలను ఏర్పరుచుట.
- ☆ వ్యవసాయ పనిముట్లు మరియు ఎరువులను పంపిణీ చేయుట.

### కృత్యము

మీ ఉపాధ్యాయుని సహాయంతో పంచాయతి యూనియన్ అధ్యక్షుని ఇంటర్వ్యూ చేయుము. వారి విధులను, భవిష్యత్తు ప్రణాళికలను వ్రాసుకొనుము. తరగతి గదిలో మీ ఉపాధ్యాయులతో చర్చించుము.

పంచాయతి యూనియన్ పనులను జిల్లా పరిపాలనా ఆధ్వర్యంలో ఉన్న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షించును. జిల్లా కలెక్టర్, ప్రణాళికాధికారి, తహసిల్దార్ మున్నగు అధికారుల సహకారంతో అన్ని ప్రణాళికలను అమలు చేయుదురు.

### జిల్లా పంచాయతి

ఒక్కొక్క జిల్లాయందు ఒక జిల్లా పంచాయతి ఉండును. జిల్లా పంచాయతి సభ్యులను ప్రజలు ఎన్నికల ద్వారా 1:50,000 నిష్పత్తిలో ఎన్నుకొందురు. ఈ సభ్యులలో ఒకరిని జిల్లా పంచాయతి అధ్యక్షునిగా ఎన్నుకొందురు. వీరి పదవీకాలం 5 సంవత్సరములు.

### జిల్లా పంచాయతి విధులు

జిల్లాయందు గల అన్ని గ్రామ పంచాయతీలు, పంచాయతి యూనియన్‌ల అభివృద్ధి పథకములు, రహదారుల నిర్మాణము మరియు రవాణా కొరకు చేపట్టిన కార్యక్రమములపై ప్రభుత్వమునకు సూచనలను ఇచ్చును. అంతేకాక జిల్లాలో జరుగు అనేక అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించును.

### కృత్యము

విద్యార్థులను చిన్న గ్రూపులుగా ఏర్పరచి జిల్లాయందు గల పంచాయతి యూనియన్లు మరియు పురపాలక సంఘముల పేర్లను సేకరించి పట్టికలో పొందుపరుచుము.



### జిల్లా ప్రణాళికా సంఘము

జిల్లా పంచాయతి అధ్యక్షుడే జిల్లా ప్రణాళికా సంఘము అధ్యక్షుడిగా ఉండును. జిల్లా మొత్తము అభివృద్ధి ప్రణాళికను తయారుచేసి రాష్ట్ర ప్రణాళికా సంఘమునకు సమర్పించుట జిల్లా ప్రణాళికా సంఘము యొక్క ముఖ్యమైన విధి. స్థానిక సంస్థల ప్రతినిధులు ఈ సంఘ సభ్యులను ఎన్నుకొందురు. ఆయా జిల్లాలోని శాసన సభ, పార్లమెంటు సభ్యులు ఈ ప్రణాళికా సంఘమునందు సభ్యులుగా ఉందురు

.

### పట్టణ పంచాయతి

10,000 మంది పైన జనాభా గల గ్రామములను పట్టణ పంచాయతీలుగా ఏర్పరచిరి. వీటి అధ్యక్షుడు, సభ్యులను ప్రజలే ప్రత్యక్షముగా ఎన్నుకొందురు. పట్టణ పంచాయతి పనులను కార్య నిర్వహణాధికారి పర్యవేక్షించును.

### పురపాలక సంఘము (మున్సిపాలిటి)

ఒక లక్షకు పైగా జనాభా కలిగిన ప్రాంతములను పురపాలక సంఘము అందురు. వీటి అధ్యక్షుడు మరియు సభ్యులను ప్రజలు ప్రత్యక్షముగా ఎన్నికల ద్వారా ఎన్నుకొందురు. వీరి పదవీ కాలము 5 సంవత్సరములు. పురపాలక సంఘ పరిపాలనను మున్సిపల్ కమీషనర్ నిర్వహించెదరు.

### నగరపాలక సంస్థ (కార్పోరేషన్)

కొన్ని లక్షల జనాభా, అన్ని మౌలిక వసతులు, ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయములు కలిగియున్న నగరమును నగరపాలక సంస్థ అందురు. నగరపాలక సంస్థకు మేయర్ అధ్యక్షుడు. మేయర్ పదవీ కాలము 5 సంవత్సరములు. నగరపాలక సంస్థ పరిపాలన అధికారిని నగర కమీషనర్ అందురు.



చెన్నై నగరపాలక సంస్థ

## మూల్యాంకనము

### I. సరైన సమాధానమును గుర్తించుము.

1. భారతదేశమున స్థానిక స్వపరిపాలనను ప్రవేశపెట్టిన వారు ____________.
   అ) రిప్పన్ ప్రభువు ఆ) గాంధీజీ ఇ) ఇందిరా గాంధి
2. గ్రామ పంచాయతి అధ్యక్షుని ________ ఎన్ను కొందురు.
   అ) వార్డు సభ్యులు ఆ) ప్రజలు ఇ) యూనియన్ అధ్యక్షుడు

### II. ఖాళీలను పూరింపుము.


1. మేయర్ పదవీకాలము ____________.
2. ఒక్కొక్క జిల్లాయందు ఒక ________ పంచాయతి కలదు.

### III. క్రింది ప్రశ్నలకు సమాధానము లిమ్ము.

1. స్థానిక ప్రభుత్వము ఎందుకు అవసరము?
2. గ్రామసభయొక్క విధు లేవి? సంవత్సరమునకు ఎన్నిసార్లు ఏయే రోజులలో గ్రామసభ సమావేశమగును?
3. గ్రామ పంచాయతి విధులను నాల్గింటిని తెలుపుము.
4. గ్రామ పంచాయతిలకు ఆదాయము ఏ విధముగా వచ్చును?
5. పంచాయతి యూనియన్లు ఎట్లు ఏర్పడును?

## రూపక నిర్ధారణ

1. పంచాయతీ యూనియన్ అధ్యక్షుని ముఖాముఖి (Interview) ద్వారా ప్రశ్నించుటకు ఒక ప్రశ్నావళిని రూపొందించుము.
2. ఎన్నికల నియమంలో జరిగే ప్రధాన కార్యక్రమాలపై ఒక నాటికను వ్రాయుము.
3. నీవు పంచాయతీ యూనియన్ అధ్యక్షుని కలిసి స్థానిక సమస్యల పరిష్కరణకై సమర్పించే దరఖాస్తు సమూనాను తయారుచేయుము.
4. ఒక పాఠశాల యొక్క నిర్వహణను సక్రమముగా జరపాలంటే ఎటువంటి కమిటీలను ఏర్పాటు చేయవల్సిన అవసరమున్నది?
5. మీ పంచాయతీ యూనియన్‌పై ఆలోచనా పటము(Mind Map)ను రూపొందించుము.



# 2. ప్రజాస్వామ్యము, మానవ వనరులు మరియు మహిళా సాధికారత

ఒక దేశములో ప్రజలచేత ఎన్నుకొనబడిన ప్రతినిధులద్వారా పరిపాలించుటను ప్రజాస్వామ్యము అందురు. ప్రజలే ప్రభుత్వమును పాలించుటను గణతంత్ర ప్రజాస్వామ్యము అందురు.

ప్రజాస్వామ్యమునందు ప్రజలందరు సమాన హక్కులు కలిగియుందురు. 18 సంవత్సరముల వయస్సు నిండిన వయోజనులు అందరికీ ఓటు వేయు హక్కు కలదు.

మన దేశ పౌరులందరికి సమాన అవకాశములు కల్పించబడినవి. కాని దేశ ప్రజలలో అర్ధ భాగమున్న స్త్రీల అవకాశములను నిరాకరించి వెనుకకు నెట్టబడుటవలన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనమగుచున్నది. స్త్రీలను అన్ని రంగములలో సంపూర్ణ భాగస్వామ్యులుగా చేసినట్లయితే ప్రజాస్వామ్యము బలపడును.

సమాజములో పలు కారణములచేత ప్రజలమధ్య ఎన్నో తారతమ్యములు ఏర్పడి ఉన్నవి. అట్లు ఏర్పడినదే ఉన్నత వర్గము – అణగారిన వర్గము, ధనవంతులు – పేదలు, యజమాని – కార్మికులు, పాలకుడు – బానిస, విద్యావంతుడు – నిరక్ష్యరాస్యుడు, వ్యవసాయదారుడు – కౌలుదారుడు. పౌరుల సమానత్వమే ప్రజాస్వామ్యము యొక్క ప్రాథమిక లక్ష్యము.

సమాజములో హెచ్చు తగ్గులవలన మంచి జీవనమునకు కావలసిన మంచి అవకాశములను ఎంతో మంది ఎంతో కాలముగ కోల్పోయిరి. ఇట్లు అవకాశములు కోల్పోయిన ప్రజలకు తిరిగి మంచి అవకాశములు కల్పించడము ద్వారానే వారు సంపూర్ణ జీవనాన్ని గడపగలరు. ఈ విధముగా చేసిన యెడల సమాజంలో నెలకొని యుండు హెచ్చు తగ్గులు నివారించి ఒక సమసమాజమును ఏర్పరచవచ్చును. ఆ విధముగా చేయుట వలన "సామాజిక న్యాయము" జరుగును.

సహజముగా స్త్రీలు – పురుషులు అను లింగ భేదము కలిగిన సమాజంలో ఎన్నో సంవత్సరములుగా పురుషులు ఉన్నతమైన వారని, స్త్రీలు తక్కువైన వారని గుడ్డిగా నమ్ముచున్నాము. ఈ గుడ్డి నమ్మకము సమాజముయొక్క ఐక్యమత్యమునకు, మానవాభివృద్ధికి ఆటంకము గానున్నది.

సహజముగా స్త్రీలు సున్నిత స్వభావము కలవారు. పురుషులు కంటే స్త్రీలు బుద్ధికుశలతలో తక్కువైన వారు కారు. పురుషులు కండబలము కలవారని మరియు గొప్పవారని చెప్పబడుచున్నారు. కానీ స్త్రీలు పురుషులకంటే మనోధైర్యంలో తక్కువైన వారు కారు. శారీరక మరియు మానసిక బలము వ్యక్తికి వ్యక్తికి మధ్య తేడా ఉండును. ఈ వ్యత్యాసము లింగ భేదము వలన రాదు. సమాజమునందు వంశపారంపర్య ఆచారముల కారణంగా పురుషులకే విద్యనభ్యసించు అవకాశము, ఉద్యోగ అవకాశము, ఆస్తిని కలిగియుండు హక్కు మొదలగునవి ఏర్పడినవి. దీని వలన పురుషులే సమాజమునందు ఆధిక్యత వహించి పరిపాలించుటకు, ప్రభుత్వ ఉన్నతపదవులు పొందుటకు అర్హులు అను చెడు అభిప్రాయము ఏర్పడినది.

మాతృత్వము కారణంగా స్త్రీలు పిల్లలను కనిపెంచు కర్తవ్యమును, ఇంటి బాధ్యతలను కలవారని, ఇంటి వెలుపల పనులు మరియు ఇతర కఠినమైన పనులను పురుషులు మాత్రమే చేయుటకు తగినవారను అభిప్రాయము సమాజమునందు చాలా కాలముగా ఉన్నది.

సమాజమునందు స్త్రీలు తండ్రి, భర్త, సోదరులు మరియు కుమారుడు అను బంధము గల పురుషునిపై ఆధారపడి జీవించుచున్నారు.

ఈ అభిప్రాయమే తరతరాలుగా నిలిచిపోయినది. సమాజములో ఇటువంటి అభిప్రాయములే విద్యార్థుల మనస్సులోనూ నిలిచిపోయినది.

ప్రాచీన కాలము నుండి స్త్రీల మానసిక మరియు శారీరక సామర్థ్యము తెలుసుకొనుటకు వారు చేయు వివిధ పనులు గమనించిన తెలియును.

- ☆ ఇంటి నిర్వహణ, వంటచేయుట మరియు ఇంటి ఆదాయమును పెంచుట.
- ☆ పశువులను పెంచి దీని ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించుట.
- ☆ చాపలను అల్లుట, బుట్టలను అల్లుట మరియు ఇంటి పై కప్పులకు కావలసిన ఎండు కొబ్బరి ఆకులను అల్లుట.
- ☆ వైద్యము లేదా ఆరోగ్య సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, రోగ నిరోధక సిబ్బంది మరియు ఇంటి వద్ద వైద్యము చేయుట.
- ☆ ప్రసూతి పనులు, శిశు సంరక్షణ, పిల్లలను పెంచుట.
- ☆ ఇంటితోట పని, కూరగాయలు, పండ్లు, పూలు, పాలఉత్పత్తి చేసి విక్రయించుట.
- ☆ ఇంటి పొదుపు, బంధువులతో సత్సంబంధము కలిగియుండుట.
- ☆ వ్యవసాయకూలీలు, వ్యవసాయ పనులద్వారా ధాన్యమును సేకరించుట మరియు ధాన్యమును భద్రపరచుట.

బుద్ధికుశలత, ఓర్పు, సమయస్ఫూర్తితో, ఇటువంటి నిరంతర శ్రమతో కూడిన పనులను స్త్రీలు చాలా కాలము నుండి చేయుచున్నారు. విద్యాభివృద్ధి వలన ఉపాధ్యాయ, నర్సులు, టైపిస్టులు, స్టెనోలు, పోలీసులు మొదలగు అనేక వృత్తులను చేపట్టి అభివృద్ధి చెందుచున్నారు. ఇంకను ప్రసిద్ధి చెందిన వైద్యులుగాను, ఇంజనీరులుగాను, పర్యవేక్షకులు గాను, న్యాయవాదులు గాను, న్యాయ మూర్తులుగాను, పత్రికారంగమందు, చలనచిత్ర పరిశ్రమందు, సంగీతమునందు తమ ప్రతిభను చాటుచున్నారు. ఇంకను కార్లు, బస్సులు, లారీలు, ట్రాక్టర్ నడుపుటలోను, విమానం నడుపుటలోను, అంతరిక్షయానం చేయుటలోను, క్రొత్త విషయములను పరిశోధించి తెలుసుకొనుట లోను స్త్రీలు పురుషులతో పోటీ పడుచున్నారు. ప్రభుత్వ అధికారులుగా, బ్యాంకు మేనేజరులుగా,



జిల్లా కలెక్టర్‌లుగా మరియు పోలీస్ కమీషనర్‌లుగా పదవులు చేపట్టి ప్రసిద్ధి చెందినారు.

ఈ విధముగా అనేక రంగములందు స్త్రీలు అనేక పనులను చేపట్టి ప్రఖ్యాతి చెందిన తర్వాత పురుషులు మాత్రమే అన్ని పనులు చేయగలవారని చెప్పుట ఎవరికి సాధ్యము? మహాకవి భారతియార్ కలలు గన్న నవయుగ స్త్రీలుగా ఎంతో మంది సమాజంలో ఎదిగిరి

మహిళల నవమాన పరచు
మౌఢ్యంబును కాల్చుదాం
విశ్వ జీవంబున
యే విధముగను మనయందు
బానిసలను మాట పోయి
పడతి పురుషుడును సమమే
అని తలపును కలిగి
మనము ఆడా మగా జీవిద్దాం!

ఈ ప్రసిద్ధ గేయమును సుప్రసిద్ధ జాతీయ కవి భారతియార్ ఆలపించినారు. ఈ గేయము ఏరంగములోను పురుషులకు స్త్రీలు తక్కువైనవారు కాదు అని తెలుపుచున్నది.

### స్త్రీలలో ఆణి ముత్యము – డా॥ ముత్తులక్ష్మి రెడ్డి.

బహుముఖ ప్రజ్ఞాశాలియైన డా॥ ముత్తులక్ష్మి రెడ్డి భారతీయ స్త్రీలలో ఒక ఆణిముత్యము.

ఈమె 1846 సంవత్సరము జూలై 30 వ తేదీన పుదుక్కోట సంస్థానమున జన్మించెను. ఈమె విద్యార్థి దశలోనే ప్రతిభను కనబరచెను. “పువ్వు పుట్టగానే పరిమళించును” అనే సామెత మేరకు చిన్నతనములోనే బుద్ధి సూక్ష్మతను, అత్యంత ప్రతిభను కనబరచెను.

స్త్రీ విద్యను అనుమతించని ఆ రోజులల్లో విద్యాభ్యాసమును తన ఇంటినందే ముగించి, పరీక్షలలో ఉత్తీర్ణత సాధించెను. పురుషులు మాత్రమే విద్యార్థులుగా ఉండిన పుదుక్కోట కళాశాలయందు మొట్టమొదట మహిళా విద్యార్థినిగా విద్యను అభ్యసించిన ఘనత ఆమెకే చెందును. ఈమె బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈమె సహజంగానే నీతి నియమములు, జాలిగుణము మరియు మానవత్వము వంటి గొప్పగుణములు కలిగియుండెను.



డా॥ ముత్తు లక్ష్మిరెడ్డి

1912 సం॥లో చెన్నై వైద్య కళాశాలలో వైద్యురాలిగా పట్టా పొందిన మొట్టమొదటి భారతీయ మహిళ డా॥ ముత్తులక్ష్మి రెడ్డి. ఆనాటి ఆంగ్లేయ ప్రభుత్వము ఈమెను చెన్నై శాసన సభయందు శాసనమండలి సభ్యురాలిగా నియమించెను. శాసనమండలికి ఎన్నికైన మొదటి మహిళగాను అనంతరము ఆ శాసన సభకు ఉపాధ్యక్షురాలిగా తన విధులను సక్రమముగా నిర్వర్తించెను. పురుషులవలె స్త్రీలకు ఓటు హక్కు, ఆస్తి హక్కు కొరకై శాసనసభలో పోరాడెను.

అఖిలభారత మహాసభకు మొట్ట మొదట అధ్యక్షురాలిగా, చెన్నై నగరపాలక సంస్థకు ప్రథమ సభ్యురాలిగా ఎన్నుకొనబడి పలువురి ప్రశంసలు పొందెను. స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల పిలుపునందుకొని వారి అడుగుజాడలో నడచి, మహాకవి భారతియారు మన్ననలను పొందెను.

సమాజమునందు స్త్రీలు తరతరాలుగా అనుభవించుచున్న బాధలను చూచి వేదన చెంది వారి కన్నీటిని తుడిచే ప్రయత్నము చేసెను. స్త్రీలకు విద్యనభ్యసించే హక్కును, పురుషులతో సమానమైన హక్కులు, స్వతంత్ర జీవనము కొరకు, బాలికల బాగోగులు మరియు వారి అభివృద్ధికి పాటుపడెను.

క్యాన్సరు రోగముతో మరణించు స్త్రీలకొరకు లండన్ నందుగల రాయల్ క్యాన్సర్ వైద్యశాలయందు విద్యనభ్యసించి ముగించిన పిమ్మట, చెన్నై అడయారు నందు ఒక క్యాన్సరు వైద్యశాలను ప్రారంభించెను. నేటికి ఈ వైద్యశాల పేరుప్రఖ్యాతులతో సేవనందించుచు ఆమె పేరును, కీర్తిని నిలబెట్టుచున్నది.

వితంతువులు, భర్తచే విడువబడిన స్త్రీల బాగోగులు మరియు అనాథల కోసము తాంబరము నందు ప్రభుత్వ సహాయముతో స్త్రీల పునరుద్ధరణ గృహమును ఏర్పరచెను.

మన దేశములో బాల్య వివాహములు ఆచరణలో ఉన్నందున, దీనిని రూపుమాపుటకై ప్రభుత్వ దృష్టికి తీసుకొని పోయి, బాల్య వివాహ నిరోధ చట్టము చేయించెను.

ఆనాటి సమాజమునందు యువతులకు మాంగల్యము కట్టి దేవాలయమునందు సేవ చేయుటకు తమ జీవితాలను అంకితమిచ్చే "దేవదాసి వ్యవస్థ" ఆచరణలో ఉండినది. దీని వలన వేలకొలది స్త్రీల జీవితము నాశనమైపోయేది.

భగవంతునికి సేవ చేయడానికి సరైన మార్గము దేవదాసీలుగా మారడం అను నమ్మకము ఆ రోజులలో వుండెను. ఇది స్త్రీ జాతియందు గల ఒక సాంఘిక దురాచారము. డా॥ ముత్తులక్ష్మి రెడ్డి శాసనసభ యందు పోరాడి దేవదాసి నిరోధక చట్టము తీసుకొచ్చెను. దీనిని ఆపుటకు పోరాడిన మతపెద్దలను, పురోహితులను ఈమె ఎదురించెను. ఆ సమయమున వ్యక్తిగత గౌరవ ఉద్యమ అధ్యక్షుడు ఈ.వి.ఆర్. పెరియార్ ఆదరణ మరియు సహకారముతో శాసనసభలో వాదించి దేవదాసి నిరోధ చట్టమును అమలు చేసెను.

ఆ రోజులలో ఇ.వి.ఆర్. పెరియార్, తమిళ కవి తిరు.వి.క, మూవలూరు రామమీర్తమ్ అమ్మగారు ఈ చట్టమును బలపరచిరి. వారు ఈ చట్టము యొక్క ప్రాధాన్యతను ప్రజలకు వివరించిరి. ఇది ఆనాటి ప్రజల సామాజిక జీవనమును తెలుపుచున్నది.

డా॥ ముత్తులక్ష్మిరెడ్డి తన జీవిత కాలములో అనేక సాంఘిక సంస్కరణలు చేపట్టెను. అనాథ శరణాలయములను ప్రారంభించెను. మురికి వాడలలో నివసించు ప్రజల జీవనమును చూచి వారికి మంచి ఆరోగ్య కేంద్రములను ఏర్పరచెను. ఈమె 1930 సంవత్సరమున అడయారునందు అనాథ స్త్రీల బాగోగుల కోసము 'అవ్వైహోమ్'ను ప్రారంభించెను.

బాలికల విద్యకై ఈమె 8వ తరగతి వరకు ఉచిత విద్యను ప్రవేశపెట్టెను. ఈ విధముగా సమాజసేవే ప్రధానంగా భావించి జీవించిన ఆణిముత్యము డా॥ ముత్తులక్ష్మిరెడ్డికి కేంద్ర ప్రభుత్వము 1956 సంవత్సరమున పద్మభూషణ్ బిరుదునిచ్చి గౌరవించెను.

డా॥ ముతులక్ష్మిరెడ్డి పేరు ప్రఖ్యాతులు వ్యాపింపచేయు విధంగా తమిళనాడు ప్రభుత్వము ఆమె పేరిట డా॥ ముత్తులక్ష్మిరెడ్డి ప్రసూతి పథకము అను ఒక సంక్షేమ కార్యక్రమమును ప్రవేశపెట్టినది. ఈ పథకము ద్వారా తల్లులందరికీ మంచి పోషక ఆహారము అందించుటకు ప్రసవమునకు ముందు 3 నెలలు, ప్రసవము తరువాత 3 నెలలు ప్రభుత్వము ఆర్థిక సహాయమును అందించుచున్నది.

## మూల్యాంకనము

I. సరియైన సమాధానము నిమ్ము.

1. ప్రజాస్వామ్యమునందు పౌరులందరు
   అ) సమాన పెట్టుబడిదారులు
   ఆ) సమాన ఆస్తిపరులు
   ఇ) సమాన హక్కులు కలవారు

2. భారతదేశము యొక్క మొట్టమొదటి మహిళా వైద్యురాలు
   అ) డాక్టర్ ముత్తులక్ష్మి రెడ్డి గారు
   ఆ) విజయలక్ష్మి పండిట్
   ఇ) కల్పనా చావ్లా

3. స్త్రీల వలన చేయలేని పని
   అ) క్రికెట్ ఆడుట
   ఆ) విమానము నడుపుట
   ఇ) ఏదియును లేదు

4. అవ్వైహోమ్ అనునది
   అ) వితంతువు మరియు అనాధ స్త్రీల శరణాలయము
   ఆ) అనాధ బాలికల శరణాలయము
   ఇ) మహిళా నిరుద్యోగుల శరణాలయము

II. ఖాళీలను పూరింపుము.

1. సమసమాజమును ఏర్పరుచుటను ____________ అందురు.
2. స్త్రీ, పురుషులు ఇరువురికి ఓటువేయు వయస్సు __________ .
3. 'మహిళల నవమాన పరచు మౌఢ్యంబును కాల్చుదాం' పాడినవారు ___________ .

## III. జతపరుచుము

| | | |
|---|---|---|
| 1. సమాజ తారతమ్యములను రూపుమాపుట | – | తరతరాలుగా అమలులోవున్నవి. |
| 2. పురుషులే అన్ని పదవులకు అర్హులు | – | ముత్తులక్ష్మి రెడ్డి కీర్తిని చాటుచున్నది. |
| 3. స్త్రీలు పురుషులపై ఆధారపడియే జీవించుట | – | చెడు అభిప్రాయము. |
| 4. బాల్య వివాహములను ఆపుట | – | సామాజిక న్యాయము |
| 5. అడయారు క్యాన్సరు వైద్యశాల | – | బాల్య వివాహ నిరోధ చట్టము. |

## IV. క్రింది ప్రశ్నలకు జవాబు లిమ్ము.

1. మానవ అభివృద్ధికి ఆటంకముగా ఉన్నవి ఏవి?
2. స్త్రీలు తమ మానసిక మరియు శారీరక సామర్థ్యమును ఉపయోగించి చేయు ఎనిమిది సేవలను తెలుపుము.
3. తల్లి మరియు బిడ్డల సంక్షేమముకొరకు తమిళనాడు ప్రభుత్వము ప్రవేశపెట్టిన పథకమును తెలుపుము.
4. భారతదేశమున డా॥ ముత్తులక్ష్మి రెడ్డి గారు చేసిన మొట్టమొదటి సాధనలను తెలుపుము.
5. డా॥ ముత్తులక్ష్మి రెడ్డి గారికి కేంద్ర ప్రభుత్వము ఇచ్చిన బిరుదు ఏది?
6. స్త్రీల హక్కులను సమాజము ఏ విధముగా నిరాకరించుచున్నది?

## రూపక నిర్ధారణ

1. గ్రంథాలయానికి వెళ్ళి క్రింద పేర్కొన్న నాయకుల పుస్తకములను చదువుము.

   ఎ) ఇ.వి. రామస్వామి (ఇ.వి.ఆర్)

   బి) మూవలూరు రామమీర్తమ్ అమ్మగారు

2. మీకు తెలిసిన మహిళలలో ఎవరు వారి జీవితంలో ఉన్నత స్థానాన్ని అధిష్టించారని భావించుచున్నారు? ఎందులకు?

3. భారత ప్రభుత్వ అత్యున్నత పురస్కారాలను పట్టికలో పొందుపరుచుము.

4. మహిళలు సమాన హక్కులను పొందియున్నారా లేదా అనే అంశముపై ఒక చర్చను చేపట్టుము.

5. డా॥ ముత్తులక్ష్మిరెడ్డి యొక్క వ్యక్తిగత అంశాలను (బయోడేటా) పూరింపుము.

   ఎ) పేరు

   బి) పుట్టిన తేది

   సి) పుట్టిన స్థలము

   డి) ఆమె అభ్యసించిన విద్యాసంస్థల పేర్లు

   ఇ) ఆమె నిర్వహించిన పదవులు

   ఎఫ్) ఆమె స్థాపించిన వైద్యశాల

   జి) ఆమె అందుకున్న పురస్కారము/సంవత్సరము

   హెచ్) డా॥ ముత్తులక్ష్మిరెడ్డి చేసిన గొప్ప సేవ

భూగోళశాస్త్రం

# 1. మనము నివసించు భూమి

మీ ఊరిలో పర్వతములున్నవా? సముద్రమున్నదా? నది ఉన్నదా? మీ ఊరు మైదాన ప్రాంతములో ఉన్నదా? పర్వతములు, పీఠములు, మైదానములు మొదలైనవి ముఖ్యమైన భూ స్వరూపములు.

భూ స్వరూపమునందు ఎత్తైన శిఖరములు కల్గిన వాటిని పర్వతములు అందురు. అనేక పర్వతములు వరుసగా అమరియున్నప్పుడు దానిని పర్వత శ్రేణులు అందురు. ప్రపంచము నందు మిక్కిలి ఎత్తైన పర్వత శ్రేణి హిమాలయములు.

భారతదేశ నైసర్గిక పటమును చూచి మరియొక పర్వత శ్రేణిని గుర్తించుము.

చుట్టు ప్రక్కల ఉన్న భూ ప్రాంతము కంటే ఎత్తైన సమతల ప్రాంతమును పీఠభూమి అందురు. టిబెట్ పీఠభూమి ప్రపంచములో ఎత్తైన పీఠభూమి.

దక్షిణ భారతదేశములోనున్న పీఠభూమి ఏది? మీ ఉపాధ్యాయుని సహాయంతో గుర్తించుము.

విశాలముగా వ్యాపించిన పల్లపు సమతలమైన భూభాగమును మైదానము అందురు. ఉత్తర భారతదేశములోని గంగానది పరివాహక ప్రాంతము ప్రపంచములోని ముఖ్యమైన మైదాన ప్రాంతములలో ఒకటి.

కావేరి, తామ్రపర్ణి మరియు పాలార్ మైదాన ప్రాంతములను నైసర్గిక పటమునందు గుర్తించుము.

చెన్నై, మదురై, తిరునల్వేలి, తిరుచ్చి, ఊటి, కొడైకెనాల్ మరియు తేని తమిళనాడు నందు కలవు. తమిళనాడు భారతదేశములో ఒక భాగము.

రామేశ్వరము మరియు తిరుచందూర్ ఏ భూ స్వరూపము నందు అమరియున్నవి? కనుగొనుము.

మీ ఊరు ఎచ్చట అమరియున్నది? మైదాన ప్రాంతమా? పర్వత ప్రాంతమా? లేక పీఠభూమి ప్రాంతమా? మీ ఉపాధ్యాయుని సహాయంతో తెలుసుకొనుము.


భారతదేశము ఆసియా ఖండములో ఒక భాగము. భారతదేశము, చైనా, రష్యా మరియు పాకిస్తాన్ ఆసియా ఖండములో అమరియున్నది. ఇంగ్లాడ్, ఫ్రాన్స్ మరియు జర్మని మొదలగు దేశములు ఐరోపా ఖండములో అమరియున్నవి.

ఆసియా, ఆఫ్రికా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియా మరియు అంటార్కిటికా అను ఏడు ఖండములు ప్రపంచములో కలవు. సముద్రములు కాకుండా విశాలముగా వ్యాపించిన భూభాగములను ఖండములు అందురు.


### ఏడు ఖండములు :

**1. ఆసియా:**

ఏడు ఖండములలో ఆసియా ఖండము చాలా పెద్దది. ఇది ఉత్తరార్ధ గోళములో అమరియున్నది. మనము నివసించు భారతదేశము ఆసియా ఖండములో కలదు. ఈ ఖండములో గోబి శీతల ఎడారి మరియు హిమాలయ పర్వతములు కలవు.



# ప్రపంచ పటము




ఏడు ఖండములు
ఐదు మహాసముద్రములు